ఆస్తిపన్ను వందశాతం వసూలు చేయాలి

• మున్సిపల్ సమీక్ష సమావేశంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నీలగిరి, నవంబర్ 27 : మున్సిపాలిటీలో ఆస్తి పన్నులను వంద శాతం వసూలు చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. బుధవారం మున్సిపల్ కౌన్సిల్ హాల్లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో అన్ని విభాగాలు సిబ్బంది విధుల గురించి ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీ ద్వారా వసూలు చేసే ఆస్తిపన్నును వందశాతం వసూలు చేయాలని, ముఖ్యంగా మున్సిపాలిటీ ద్వారా ఆదాయం వచ్చే కార్యక్రమాలపై దృష్టి కేంద్రీకరించాలని అన్నారు. మున్సిపాలిటీలో తాగు నీటి ట్యాంకుల నిర్మాణాన్ని త్వరిగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. మున్సిపల్ సిబ్బంది సమయపాలన పాటించాలని, నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పెయిడ్ లైసెన్స్‌లకు సంబంధించి వంద శాతం వసూలు చేయాలన్నారు. మున్సిపాలిటీ ద్వారా చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఇంజినీరింగ్ సిబ్బంది ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, పబ్లిక్ హెల్త్ ఈఈ సత్యనారాయణ, మేనేజర్ శైలజ, స్థానిక తాసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

1,66,485 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

నీలగిరి : వానకాలం ధాన్యం సేకరణలో జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 27,936 మంది రైతుల నుంచి 1,66, 485 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.386.24 కోట్లు వారి ఖాతాలో జమ చేశామని, రూ. 1.51 కోట్లు సన్నధాన్యం అమ్మిన రైతులకు బోనస్‌గా చెల్లించామని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

• న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి దీప్తి

బాల్యవివాహాల నిర్మూలనపై ప్లకార్డులు ప్రదర్శిస్తున్న న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి దీప్తి, ఐసీడీఎస్ పీడీ

రామగిరి, నవంబర్ 27: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని, ఈ విషయమై ప్రజల్లో చైతన్యం తేవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి బి.దీప్తి సూచించారు. ఐసీడీఎస్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నల్లగొండలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, బీసీ గురుకుల జూనియర్ కళాశాలలో బాల్య వివాహ విముక్తి భారత్ అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బాల్య వివాహాలు చేస్తే కలిగే నష్టాలు, న్యాయ పరమైన సమస్యలను విద్యార్థినులకు వివరించారు. ఐసీడీఎస్ పీడీ కేవీ. కృష్ణవేణి మాట్లాడుతూ బాల్య వివాహాలతో పాటు ఇతర అంశాలపై బాలికలను ఎవరైనా ఇబ్బంది పడితే 1098కి ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుధారాణి, డీసీపీఓ గణేశ్, సఖి కేంద్రం బాధ్యులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు పాల్గొన్నారు.

డాటా ఎంట్రీని త్వరితగతిన పూర్తి చేయాలి

• అదనపు కలెక్టర్ శ్రీనివాస్

డాటా ఎంట్రీని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

కట్టంగూర్, నవంబర్ 27 : సమగ్ర కుటుంబ సర్వే డాటా ఎంట్రీని త్వరితగతిన పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్, తాసీల్దార్ కార్యాలయాల్లో జరుగుతున్న డాటా ఎంట్రీని ఆయన పరిశీలించారు. వివరాలను అధికారులు, ఆపరేటర్లను అడిగి తెలుసుకున్నారు. సర్వే వివరాలను గోప్యంగా ఉంచాలని సూచించారు. అనంతరం స్థానిక కేజీబీవీని సందర్శించి మధ్యాహ్న భోజనం, రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట డీఈఓ బొల్లారం భిక్షపతి, తాసీల్దార్ గుగులోతు ప్రసాద్, ఎంపీడీఓ పెరుమాళ్ల జ్ఞానప్రకాశ్ రావు, ఎంపీఓ చిమల్ల చలపతి, ఆర్ఐ కుమార్‌రెడ్డి, కేజీబీవీ ప్రత్యేకాధికారి నీలాంబరి ఉన్నారు.

కర్నాటకలో పర్యటించిన పీఏసీఎస్ బృందం

సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

నీలగిరి, నవంబర్27 : ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘాల అధ్యక్షుల ఎడ్యుకేషనల్ టూర్‌లో భాగంగా డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం కర్నాటక రాష్ట్రంలోని మైసూర్ జిలా నందినాథపుర సొసైటీని నల్లగొండ జిల్లా పీఏసీఎస్ చైర్మన్లు సందర్శించారు. అక్కడి సొసైటీలో జరుగుతున్న అభివృద్ధి, పాలసీలు, బైలాలలోని అంశాలను నందినాథపుర సొసైటీ సభ్యులు, రైతులను అడిగి తెలుసుకున్నారు. సొసైటీ రైతుల అభివృద్ధికి ఏ విధంగా తోడ్పతుందనే విషయాన్ని ఆరా తీశారు. అనంతరం నందినాథపురం చైర్మన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు పాశం సంపత్‌రెడ్డి, గుడిపాటి సైదులు, కొండా సైదులు, జయరాం, రామచంద్రయ్య, సహకార సంఘాల చైర్మన్లు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో బీసీ కులగణన చేపట్టాలి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి లింగంగౌడ్

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

మిర్యాలగూడ, నవంబర్ 27: కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో బీసీ కులగణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు. బీసీల సమస్యల పరిష్కారానికి డిసెంబర్ 5, 6 తేదీల్లో నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమ పోస్టర్లను బుధవారం పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 శాతంపైగా బీసీల జనాభా ఉందని, ప్రాతినిధ్యంలో మాత్రం 15 శాతం కూడా దాటడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం జనవరిలో చేపట్టే జాతీయ జనగణనలో బీసీ కులగణన చేయాల, బీసీల జనాబా దామాషా ప్రకారం విద్యా, ఉద్యోగాలు, చట్టసభల్లో రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు, గుండెబోయిన నాగేశ్వర్‌రావుయాదవ్, సందెనబోయిన జయమ్మ, తిరందాసు విష్ణు, చేగొండి మురళి, ఊరిబండి శ్రీనివాస్, సావిత్రి, జయరాజు, శరత్, శ్రీధర్ , తిరుపతయ్య పాల్గొన్నారు.

ప్రాణం తీసిన పొలం గెట్టు పంచాయితీ

• భూ వివాదాల నేపథ్యంలో వ్యక్తిపై దాడి చేసి హత్య

చందంపేట, నవంబర్ 27 : పొలం గెట్టు పంచాయితీ ఒకరి ప్రాణం తీసింది. భూ వివాదాల నేపథ్యంలో వ్యక్తిపై కర్రలతో దాడి చేయడంతో అతను తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన బుధవారం చందంపేట మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చందంపేట మండంలోని యల్మలమంద గ్రామపంచాయతీ పరిధిలోని గుండుతండాకు చెందిన కేతావత్ సామ్య (50)కు అదే గ్రామపంచాయతీ పరిధిలోని చేపలగేటుకు చెందిన బాణావత్ దాస్య, హన్మలతో వ్యవసాయ భూమి విషయంలో వివాదాలు ఉన్నాయి. బుధవారం బాణావత్ దాస్య, హన్మతో పాటు మరో పది మంది కేతావత్ సామ్య ఇంటికి వెళ్లి కర్రలతో అతడిపై దాడి చేశారు. తలకు తీవ్ర గాయమైన సామ్యను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ అతను మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సతీశ్ తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

వధువు కావలెను

కోమట్లు లేక బి.సి. అమ్మాయి కావలెను. కోమట్ల అబ్బాయి 36, M.Sc., ప్రైవేట్ లెక్చరర్, వ్యవసాయం, 30 వేలు, ఆస్థి 50 లక్షలు నల్లగొండ సెల్:9121325068.

NLG-

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...

ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/- ప్రతి అదనపు లైన్‌కు 50/-

Note: 3+1 Scheme Available
Minimum 4 Lines, Extra Line - Extra Amount
5% GST అదనం

పూర్తి వివరాలకు
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, (గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.)

నల్లగొండ : 9182777626	నల్లగొండ : 9182777635	దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059	సూర్యాపేట : 9182777630	భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059	కోదాడ : 9182777630	చౌటుప్పల్ : 9182777638

29న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నీలగిరి, నవంబర్ 27: నల్లగొండ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఈ నెల 29న చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యులు సమయానికి హాజరు కావాలని, అధికారులు తగిన సమాచారంతో హాజరు కావాలని కోరారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

తిరుమలగిరి(సాగర్), నవంబర్ 27: మండలంలోని తిమ్మాయిపాలెం గ్రామానికి చెందిన మూడావత్ రామారావు ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొందాడు. సీఎం సహాయనిధి నుంచి అతడికి మంజూరైన రూ.60వేల చెక్కును బుధవారం మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మెరావత్ మునినాయక్, అనుముల అంజి, శౌరి నాయక్, బీలూనాయక్, నాగేందర్, బిచ్యాలు, రమేశ్‌నాయక్ పాల్గొన్నారు.

ఆరెగూడెం వాసికి డాక్టరేట్

శ్రీరామ్ దైద

గుర్రంపోడ్, నవంబర్ 28 : మండలంలోని ఆరెగూడెం గ్రామానికి చెందిన శ్రీరామ్ దైద డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. వాణిజ్య విభాగంలో ఆచార్య డి.రవీంద్రనాథ్ సోలోమన్ పర్యవేక్షణలో 'ఈగల్స్ మోడల్‌ను ఉపయోగించి భారతదేశంలోని ఎన్నిక చేయబడిన ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకుల ఆర్థిక ఫలితాల విశ్లేషణపై' పరిశోధన గ్రంథాన్ని సమర్పించడంతో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆయనకు డాక్టరేట్ అందించింది. శ్రీరామ్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని బద్రుకా డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నాడు. డాక్టరేట్ పొందిన శ్రీరామ్‌ను కళాశాల ప్రిన్సిపాల్ బి.మోహన్ కుమార్, డైరెక్టర్ ఆచార్య అభిరామకృష్ణ, సెక్రటరీ కిషన్ బద్రుక, అధ్యాపకులు అభినందించారు.

గీత కార్మిక సంఘాల కార్యవర్గం ఎన్నిక

చిట్యాల, నవంబర్ 27 : సర్దార్ సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం మండల, పట్టణ కమిటీలను బుధవారం ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో జరిగిన సంఘం సమావేశంలో కమిటీ గౌరవాధ్యక్షుడిగా పుల్లెంల కోటయ్య, అధ్యక్షుడిగా పంతంగి వెంకన్న, ఉపాధ్యక్షులుగా గుణగంటి వెంకన్న, వెంగలి నర్సింహ, ప్రధాన కార్యదర్శిగా బొడ్డు శంకర్, కోశాధికారిగా అంతటి గణేశ్ ఎన్నికయ్యారు. పట్టణ గౌరవాధ్యక్షుడిగా పొన్నం లక్ష్మయ్య, అధ్యక్షుడిగా ఉయ్యాల మల్లేశ్, ఉపాధ్యక్షులుగా పొట్లపల్లి శ్రీనివాసు, బత్తుల స్వామి, నాతి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా కొంపెల్లి సైదులు, సహాయ కార్యదర్శిగా పంతంగి శ్రీనివాసులు, సలహాదారుడిగా కల్లెం నరేందర్, కార్యవర్గ సభ్యులుగా గురిజ సైదులు, కొంపెల్లి రవిని ఏన్నుకున్నారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పరిటాల రవి, చిట్యాల గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మారగోని రమేశ్, నియోజకవర్గ అధ్యక్షుడు కొంపెల్లి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి కాసుల సత్యనారాయణ పాల్గొన్నారు.

భార్యపై భర్త కత్తితో దాడి

తీవ్రగాయాలు.. ఆస్పత్రికి తరలింపు

దేవరకొండరూరల్, నవంబర్ 27 : కుటుంబ కలహాలతో భార్యపై భర్త కత్తితో దాడి చేసిన ఘటన బుధవారం మండలంలోని పడ్మట్‌పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. సీఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. పడ్మట్‌పల్లి గ్రామానికి చెందిన కిన్నెర బాలరాజు, భార్య కిన్నెర అరుణ మధ్య కొద్ది రోజులుగా కుటుంబ తగాదాలు జరుగుతున్నాయి. బాలరాజు మరో యువతితో వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో ఇద్దరి మధ్య ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. బుధవారం మధ్యాహ్న సమయంలో భార్యాభర్తలు గొడవ పడ్డారు. దాంతో ఆవేశానికి లోనైన బాలరాజు చికెన్ కట్‌చేసే కత్తితో అరుణ మెడపై నరికాడు. ఆమె కేకలు విని స్థానికులు అక్కడికి చేరుకొని ఆమెను వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వైద్యులు చికిత్స అందిస్తున్నారు.బాధితురాలి తమ్ముడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నర్సింహులు తెలిపారు.

దీక్షాదివస్‌ను విజయవంతం చేయాలి

• మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ, నవంబర్ 27: ఈ నెల 29న నల్లగొండలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించే దీక్షాదివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ కార్యక్రమానికి మిర్యాలగూడ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు.

పెద్దఅడిశర్లపల్లి : ఈ నెల 29న నల్లగొండలో చేపట్టే దీక్షాదివస్‌ను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎల్గూరి వల్లపురెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. పీఏపల్లి, గుడిపల్లి మండలాల నుంచి బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సాధనకు కేసీఆర్ చేసిన కృషి, పదేండ్ల తెలంగాణ అభివృద్ధిపై వివరించనున్నట్లు పేర్కొన్నారు.

పత్తి కొనుగోళ్లలో అవకతవకలకు అవకాశం ఇవ్వొద్దు

• ప్రాంతీయ మార్కెటింగ్ అధికారి శ్రీనివాస్

రైతులు, అధికారులతో మాట్లాడుతున్న శ్రీనివాస్

మునుగోడు, నవంబర్ 27 : పత్తి కొనుగోళ్ల విషయంలో అవకతవకలకు అవకాశం ఇవ్వొద్దని ప్రాంతీయ మార్కెటింగ్ సంయుక్త సంచాలకుడు ఉప్పుల శ్రీనివాస్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని కాటన్ మిల్లులో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం రైతుల వద్ద కొనుగోళ్లు చేపట్టాలని ఆదేశించారు. అధికారులతో మాట్లాడి రైతుల ఖాతాల్లో డబ్బులు ఎన్ని రోజుల్లో జమ అవుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఉప సంచాలకురాలు పద్మావతి, మార్కెటింగ్‌శాఖ జిల్లా అధికారి ఛాయాదేవి, సీసీఐ ఇన్‌చార్జి నింజా రాజేందర్, రవీందర్, మిల్లు యజమానులు, రైతులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

• ఎంపీడీఓ విజయకుమారి

మాటూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ విజయకుమారి

త్రిపురారం, నవంబర్ 27: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ పులిరెడ్డి విజయకుమారి అన్నారు. బుధవారం మండలంలోని మాటూరు గ్రామంలో సంఘబంధం మహిళల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ పార్వతీచౌహాన్, ఏపీఎం అశోక్‌కుమార్, ఏఈఓ నాగరాజు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సత్యావతి ఆస్పత్రిలో మహిళలకు ఉచిత వైద్య శిబిరం

నీలగిరి, నవంబర్ 27 : నల్లగొండ పట్టణంలోని సత్యావతి ఆస్పత్రిలో డిసెంబర్ 1 నుంచి 31 వరకు మహిళలకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ సూరేపల్లి సత్యనారాయణ, డాక్టర్లు సూరేపల్లి రామ్‌మనోహర్, సంపద బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెలరోజుల పాటు మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఓపీ ఉచితంగా చూడనున్నట్లు, అన్నిరకాల రక్త పరీక్షలు, సర్జరీలపై 50శాతం రాయితీ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అల్ట్రాసౌండ్ స్కానింగ్ రూ.500, సిజేరియన్ రూ.20వేలు, నార్మనల్ డెలివరీ రూ.10వేలు, గర్భసంచి ఆపరేషన్ రూ.25వేలు, అండాశయ కణతుల సర్జరీ రూ. 20వేలకు చేయనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 9676686664, 9542218804 నంబర్లను సంప్రదించాలని కోరారు.

విత్తనాల కోసం దుకాణాల ఎదుట పడిగాపులు

• యాసంగి సీజన్ సాగు షురూ

మిర్యాలగూడలోని ఫర్టిలైజర్ దుకాణం వద్ద రైతుల సందడి

మిర్యాలగూడ రూరల్, నవంబర్ 27 : యాసంగి సీజన్ ప్రారంభం కావడంతో చాలా మంది రైతులు సన్నరకం వరి విత్తనాల కోసం దుకాణాల ముందు పడిగాపులు కాస్తున్నారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టులో సరిపడా నీరు ఉండడంతో ఎడమ కాల్వ కింది రైతులు యాసంగిలో వరి సాగుకు సన్నద్ధమవుతున్నారు. సన్న రకం వరి విత్తనాల కోసం ఫర్టిలైజర్ దుకాణాల వారికి ముందస్తుగా అడ్వాన్స్ చెల్లించి స్టాక్ వచ్చే వరకు ఎదురు చూస్తున్నారు. తాము అడ్వాన్స్ ఇచ్చిన షాపులకు విత్తనాలు వచ్చాయన్న సమాచారం అందుకున్న రైతులు విత్తనాలకోసం షాపు వద్దకు వచ్చిన తమవంతు కోసం దుకాణం ఎదుట పడిగాపులు కాస్తున్నారు.

బ్యాడ్మింటన్ పోటీల్లో మిర్యాలగూడ విద్యార్థుల ప్రతిభ

రాష్ట్ర స్థాయిలో పతకం సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న అధికారులు

మిర్యాలగూడ, నవంబర్ 27: మెదక్‌లో జరుగుతున్న 68వ రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో అండర్-14 విభాగంలో నల్లగొండ జట్టు తరుపున ఆడిన మిర్యాలగూడ క్రీడాకారులు ప్రతిభ కనబర్చారు. దాంతో నల్లగొండ జట్టుకు బ్రౌంజ్ మెడల్ సాధించింది. మిర్యాలగూడకు చెందిన టి.అక్షిత్‌రెడ్డి, డి.కార్తికేయ, ఎస్.శమంత్ టోర్నమెంట్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చినట్లు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ టి.ప్రశాంత్ తెలిపారు. రాష్ట్రస్థాయిలో పతకం సాధించిన క్రీడాకారులను జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ డి.విమల, డీవైఎస్ఓ సీహెచ్.విష్ణువర్ధన్ అభినందించారు.

అర్ధరాత్రి పట్టుబడిన యువకులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

నీలగిరిలో ఆపరేషన్ చబుత్ర

• అర్ధరాత్రి ఆవారాగా తిరుగుతున్న 84 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
• 48బైకేలు, 5 కార్లు, మూడు ఆటోలు స్వాధీనం
• 24 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు
• తల్లిదండ్రుల సమక్షంలో యువతకు కౌన్సెలింగ్

నీలగిరి, నవంబర్ 27 : నల్లగొండ జిల్లా కేంద్రంలో మంగళవారం అర్ధరాత్రి డీఎస్పీ కొలను శివరాంరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ఆపరేషన్ చబుత్ర నిర్వహించారు. రాత్రి 11 గంటల నుంచి బుధవారం తెల్లవారు జామున నాలుగు గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నల్లగొండ వన్ టౌన్, టూటౌన్, రూరల్ పోలీసులు నిర్వహించారు. ఈ సందర్భంగా నలుగురు సీఐలు, 12 మంది ఎస్ఐలు, 80 మంది కానిస్టేబుళ్లు, 10 చెకింగ్ బృందాలు, మరో పది పెట్రోలింగ్ బృందాలు పాల్గొని నల్లగొండ పట్టణాన్ని అష్టదిగ్బంధం చేశారు. రోడ్లపై అర్ధరాత్రి ఆవారాగా తిరుగుతూ అనుమానాస్పదంగా ఉన్న 84 మందిని అదుపులోకి తీసుకొని కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా 48 బైక్‌లు, ఐదు కార్లు, మూడు ఆటోలు, 80 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 24 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు పెట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ శివరాంరెడ్డి మాట్లాడుతూ పట్టణంలో అర్ధరాత్రి అరుగుల మీద మాట్లాడుతూ, రోడ్లపై ఇష్టానుసారంగా బైక్‌లు నడుపుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రస్తుతం జరుగుతున్న నేరాల్లో దాదాపు మైనర్లు 30 సంవత్సరాల లోపు వారే అధికంగా ఉంటున్నారని తెలిపారు. పట్టుబడిన వారందరికీ వారి కుటుంబసభ్యుల సమక్షంలో టీటీఏ సెంటర్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈకార్యక్రమంలో సీఐలు డానియల్ కుమార్, రాజశేఖర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, సైదులు, ఎస్ఐలు నాగరాజు, సైదాబాబు, సురేశ్, సైదులు పాల్గొన్నారు.

మండల పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

రామలింగేశ్వరాలయంలో మండల పూజ

పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్, నవంబర్ 27 : నకిరేకల్ పట్టణంలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో బుధవారం 19వ మండల పూజ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యేను నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నడికుడి ఉమారాణీవెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీలు గుర్రం గణేశ్, నాయకులు రావిరాల మల్లయ్య, సామ శ్రీనివాస్‌రెడ్డి, దైద పరమేశ్, కౌన్సిలర్ పల్లె విజయ్, శివ మాలధారులు పాల్గొన్నారు.

హాలియాలో ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ

పడి పూజలో పాల్గొన్న సీఎల్పీనేత జానారెడ్డి, ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి

హాలియా, నవంబర్ 27 : నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి బుధవారం హాలియా క్యాంప్ కార్యాలయం లో అయ్యప్ప మహాపడి పూజను నిర్వహించారు. సత్యనారాయణ గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఏర్పాటు చేసిన మండపం సినిమా సెట్టింగ్‌ను తలపించింది. నియోజకవర్గ వ్యాప్తంగా అయ్యప్ప మాల ధారులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమాన్ని మోహన్‌రావు, గౌని రాజారమేశ్ గురుస్వాములు పర్యవేక్షించారు. కార్యక్రమంలో మాజీ సీఎల్పీ నాయకుడు కుందూరు జానారెడ్డి, నాయకులు కర్నాటి లింగారెడ్డి, మలిగిరెడ్డి లింగారెడ్డి, కాకునూరి నారాయణ, తుమ్మలపల్లి శేఖర్‌రెడ్డి, అంకతి సత్యం, చిట్టిపోలు యాదగిరి, చింతల చంద్రారెడ్డి, వెంపటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

చందుపట్లను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి

• బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నవీన్‌రావు

రాణీ రుద్రమదేవి మరణశాసనం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నవీన్‌రావు, నాయకులు

నకిరేకల్, నవంబర్ 27 : తెలంగాణ వీరవనిత రాణీ రుద్రమదేవి నడియాడిన చందుపట్ల గ్రామాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ప్రగడపు నవీన్ రావు అన్నారు. మండలంలోని చందుపట్ల గ్రామంలో రాణీ రుద్రమాదేవి 735వ వర్ధంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు రుద్రమాదేవి మరణశాసనం వద్ద నివాళులర్పించారు. రుద్రమాదేవి చిత్రపటానికి పూలమాల వేసి ఆమె వీర గాధలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఇమడపాక లక్ష్మీవెంకన్న, కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు సిల్వేరు ప్రభాకర్, నాయకులు వనం చందర్‌రావు, గోనె నర్సింహరావు, చింతమల్ల శ్రీను, ఆలకుంట్ల యాదగిరి, మాచర్ల సుదర్శన్, చౌగోని నాగరాజు, వనం నరేందర్, సత్తయ్య పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఏవీఎం విద్యార్థి

విద్యార్థిని అభినందిస్తున్న ఏవీఎం పాఠశాల యాజమాన్యం

నకిరేకల్, నవంబర్ 27 : నకిరేకల్‌లోని ఏవీఎం హైస్కూల్ విద్యార్థిని ఎన్.నిఖిత రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కందాల స్వప్నారెడ్డి తెలిపారు. ఈ నెల 26న కట్టంగూర్ మండలం చెర్వుఅన్నారం హైస్కూల్‌లో జరిగిన జిల్లాస్థాయి జూనియర్స్ హ్యాండ్‌బాల్ పోటీల్లో నిఖిత ప్రతిభ కనబర్చి జిల్లా జట్టుకు ఎంపికైనట్లు చెప్పారు. ఈ నెల 29 నుంచి డిసెంబర్ ఒకటో తేదీ వరకు నిజామాబాద్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో తమ పాఠశాల విద్యార్థిని పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. బుధవారం నిఖితను అడ్మినిస్ట్రేటర్ కందాల శ్రీకాంత్‌రెడ్డి, ఏవీఎం విద్యాసంస్థల అధినేత కందాల పాపిరెడ్డి, పీడీ నిమ్మల శంకర్‌గౌడ్ అభినందించారు.